క్షయపై సమరం

క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి బాధితులను గుర్తించి, ఉచితంగా ఆధునిక పద్ధతుల్లో వ్యాధిని నిర్ధారించి, వైద్యసేవలందిస్తోంది. అలాగే తన ప్రయత్నంలో కొందరు సమాజ సేవకులను భాగస్వామ్యం చేసుకొని వారి ద్వారా పౌష్టికాహారం అందజేసి ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి చర్యలు ముమ్మరం చేసింది.

- జిల్లాలో 8 టీబీ యూనిట్ల ఏర్పాటు
- ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో వైద్యసేవలు
- ఆధునిక పరికరాలతో వ్యాధి నిర్ధారణ
- గతంలో వ్యాధి బారిన పడిన వారికీ పరీక్షలు
- ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందజేత
- చికిత్స సమయంలో రోగికి నెలకు రూ.500
- కేసులు తగ్గించేందుకు చర్యలు



క్షయ బాధితులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ఎంపీ పోచా, అధికారులు (ఫైల్)

నంద్యాలటౌన్: క్షయ.. నోటి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణం మీదకు తెస్తుంది. టీబీ నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం ప్రతి సీహెచ్‌సీలో టీబీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. జిల్లాలో మొత్తం 8 యూనిట్లు ఉన్నాయి. వీటిల్లో ఒక సీనియర్ టీబీ సూపర్‌వైజర్, ఒక సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ విధులు నిర్వహిస్తున్నారు. వీరికి 12 మందిని సిబ్బందిని నియమించింది. క్షయ కేసులను గుర్తించేందుకు ప్రతి సీహెచ్‌సీలో ఎక్స్‌రే యూనిట్లను ఏర్పాటు చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 20 మంది టీబీ హెల్త్ విజిటర్లు పనిచేస్తున్నారు. క్షయ వ్యాధిని నిర్ధారించేందుకు గాను నంద్యాల సర్వజన ఆసుపత్రిలో సీబీ నాట్ మిషన్ ఏర్పాటు చేయడంతో పాటు, జిల్లా వ్యాప్తంగానున్న ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో 29 ట్రూనాట్ మిషన్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఆరోగ్య కేంద్రాన్ని మైక్రోస్కోప్ సెంటర్‌గా మార్చి టీబీ లక్షణా లున్న వ్యక్తి నుంచి గల్లను సేకరించి పరీక్షలు చేస్తున్నారు. సేకరించిన శాంపిల్‌లో టీబీ క్రిములుంటే సదరు వ్యక్తికి డాట్ ప్రొవైడర్ ద్వారా మందులు ఇస్తూ వ్యాధిని తగ్గించేందుకు 6 నుంచి 8 నెలల పాటు చికిత్స అందిస్తున్నారు.

ఉచితంగా మందులు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి చికిత్సకు మందులు ఉచితంగా అందిస్తున్నారు. వారికి డాట్ ప్రొవైడర్ల ద్వారా 6 నుంచి 8 నెలల పాటు మందులు అందజేస్తారు. వ్యాధి వచ్చిన తర్వాత వైద్యులు సూచించిన విధంగా నిర్ణీత సమయం మందులు వాడకపోతే అది మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీగా మారుతుంది. దీనికి రెండేళ్ల పాటు మందులు వాడాల్సి ఉంటుంది. రూ. 2లక్షల నుంచి రూ.18 లక్షల విలువజేసే మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. మందులతో పాటు రోగి పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.500 చొప్పున అందజేస్తుంది. దీంతో పాటు మందులు మింగించిన పర్యవేక్షకులకు (డాట్ ప్రొవైడర్‌కు) రూ.వెయ్యి నుంచి రూ.5వేలు పారితోషికం ఇస్తున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు నెలవారి వైద్య ఖర్చులకు నిక్షయ పోషణ యోజన్ పథకం ద్వారా రూ.500 చొప్పున అందజేస్తున్నారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా క్షయ ఉన్న 1,553 మందికి ప్రతి నెలా రూ.500 చొప్పున రూ.28,38,000 జమ చేశారు.

ఆధునిక పరికరాలతో పరీక్షలు..

వ్యాధిని కచ్చితంగా నిర్ధారణ చేసే సీబీ నాట్ మిషన్లు నంద్యాల సర్వజన ఆసుపత్రితో పాటు ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, డోన్, కోవెలకుంట్ల, నందికొట్కూరు, నంద్యాల రూరల్, వెలుగోడులోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేశారు. ఈ మిషన్ హెచ్ఐవీ రోగుల్లో, ఊపిరితిత్తుల వ్యాధులున్న వారిలో, చిన్నపిల్లల్లో క్షయ, ఎండీఆర్ టీబీని గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1,577 మంది క్షయ బాధితులు చికిత్స తీసుకుంటున్నారు. వీరికి నిక్షయ్ మిత్ర ద్వారా, దాతల సహకారంతో పోషకాహార కిట్లను అందజేసేలా చర్యలు చేపట్టారు.

టీబీ పరీక్షలు, బాధితుల వివరాలు..

సంవత్సరం	పరీక్షలు	బాధితులు
2015	8,073	2,901
2016	15,900	2,822
2017	16,024	2,855
2018	7,244	3,770
2019	17,909	4,110
2020	23,062	2,791
2021	29,346	3,467
2022	18,049	3,398
2023	30,154	3,478
2024	3,212	207

(31-01-2024వరకు)

క్రమం తప్పకుండా మందులు వాడాలి



జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధికి సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాం. డాట్ ప్రొవైడర్ ద్వారా మందులను వ్యాధిగ్రస్తులు తీసుకుని వాడాలి. వ్యాధినిర్ధారణ అయిన తర్వాత వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా వాడాలి. క్షయ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలి. –డాక్టర్ శారదాబాయి, జిల్లా క్షయ నియంత్రణాధికారి, నంద్యాల

క్షయ నిర్మూలనే లక్ష్యం



జిల్లాను క్షయ రహితంగా చేయడమే లక్ష్యంగా టీబీ రోగులకు వైద్యం అందిస్తున్నాం. అదే సమయంలో నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2030 నాటికి క్షయ ముక్త భారత్‌లో భాగంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాం. – డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్యారోగ్యాధికారి, నంద్యాల

ఇందులో భాగంగా జిల్లాలో 256 వ్యక్తులు, సంస్థలు రిజిస్టర్ చేసుకుని రోగులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. వీరిలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి 150 మందిని, గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సంస్థల అధినేత దస్తగిరి రెడ్డి 150 మంది రోగులను దత్తత తీసుకుని వారికి కావలసిన పౌష్టికాహార కిట్లను అందజేస్తున్నారు.

క్లుప్తంగా

వాహన చోదకులకు వైద్య పరీక్షలు



డ్రైవర్లకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణ శాఖాధికారి కార్యాలయంలో గురువారం వివిధ వాహన చోదకులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా రవాణా శాఖాధికారి శివారెడ్డి తెలిపారు. బీపీ, షుగర్, కంటిచూపు, ఈసీజీ పరీక్షలు చేశారు. అలాగే జిల్లాలోని విద్యా సంస్థల వాహన డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేయించారు. శాంతిరాం వైద్య కళాశాల వైద్య బృందంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. డీటీఓ మాట్లాడుతూ రోడ్డు భద్రత, రోడ్డు నియమాలపై అవగాహన కల్పించేందుకే కార్యక్రమాలు చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గుడ్ సమ్మరిటన్ పథకంపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు, వాహన చోదకులు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ఎంవీఐలు శ్రీకాంత్, జీటీ నాయుడు, రవిశంకర్‌నాయక్, సుబ్బయ్య, ఏఓ కురుమూర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా జిల్లాస్థాయి పోటీలు జోరుగా సాగుతున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు తెలిపారు. గురువారం ఆళ్లగడ్డ జట్టుపై నంద్యాల జట్టు విజయం సాధించిందని చెప్పారు. ఇండోర్‌స్టేడియంలో జరుగుతున్న క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో బాలబాలికలు పాల్గొన్నారు.విజేతలకు చివరి రోజున బహుమతుల ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

మొక్కజొన్న కోతలు షురూ



ఆలమూరు వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కజొన్న పంట కోతలు మొదలయ్యాయి.ఖరీఫ్ సీజన్‌లో వరి,మొక్కజొన్న,మినుము వంటి పంటలు ఆశించినస్థాయిలో దిగుబడి లభించడం, వాటికి గిట్టుబాటు ధర ఉండటంతో రైతులు లాభాలు గడించారు. దీంతో రెండో పంట కూడా కలిసి వస్తుందని అన్నదాతలు అదే స్థాయిలో వరి, మొక్కజొన్న,మినుము పంటలు సాగు చేశారు. పంట కాలం పూర్తి కావడంతో కొద్ది రోజులుగా మొక్క జొన్న,మినుము పంట కోతలు మొదలయ్యాయి. దిగుబడులను రోడ్డు, బయలు ప్రదేశాల్లో ఆరబోస్తున్నారు. కాగా మొక్కజొన్న ఎకరాకు 25 సంచులకు పైగా దిగుబడులు వస్తున్నాయని వారు చెబుతున్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



రైతులతో మాట్లాడుతున్న సురేంద్ర

ఆళ్లగడ్డ: పండ్ల తోటల సాగుకు ఆసక్తి చూపే చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని జిల్లా డ్వామా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర తెలిపారు. రూరల్ మండలం ఓబులంపల్లె గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా సాగు చేసిన పండ్ల తోటలను గురువారం పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్థిక సాయం

నంద్యాల(న్యూటౌన్): కర్నూలు నగరంలోని ప్రసూనా లా కళాశాలలో మొదటి సంవత్సరం న్యాయవిద్య అభ్యసిస్తున్న చాంద్‌బాషా అనే పేద విద్యార్థికి నంద్యాలకు చెందిన శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ రూ.10వేలు, విద్యార్థి సంఘం నాయకుడు న్యాయవాది షేక్‌రియాజ్ రూ.5వేల ఆర్థిక సాయం గురువారం అందజేశారు.

విజయవంతం చేద్దాం

నంద్యాల(అర్బన్): ఈ నెల 4వ తేదీన విజయవాడలో జరిగే గ్రామీణ వైద్యుల రాష్ట్ర మహాసభను విజయవంతం చేద్దామని గ్రామీణ వైద్యుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పొన్నాపురం కాలనీలో ఆర్ఎంపీ యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను ఆర్ఎంపీలతో కలిసి విడుదల చేశారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి దస్తగిరి, రాధాకృష్ణయ్య, సురేష్‌బాబు, రమేష్‌రావు, యాకూబ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై అవగాహన

గోస్పాడు: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ఏఈ జ్ఞాన సూర్యుడు విద్యుత్ సరఫరాపై మోడల్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ, విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును వివరించారు. ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్, ఇన్చార్జి మస్తానయ్య, వృత్తి ఉపాధ్యాయులు నరేష్ యాదవ్, విజయమ్మ, సబ్ స్టేషన్ ఆపరేటర్లు, మురళీధర్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిల్పా రవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సలీం నగర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

నంద్యాల: పట్టణంలోని 35వ వార్డు సలీం నగర్‌కు చెందిన వంద మంది జేసీఎస్ కన్వీనర్ దాల్‌మిల్ అమీర్, కౌన్సిలర్ షేక్ బాషీద్, గౌస్ పైలెట్, ఆదిల్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని పేర్కొన్నారు. సలీం నగర్‌లో అర్బన్ హెల్త్ సెంటర్, డ్రైన్స్, సీసీ రోడ్లు, కల్వర్టులు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, వాటిని చూసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారని చెప్పారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి



సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ

నంద్యాల(అర్బన్): ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని చాపిరేవుల సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ పనితీరును గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేసీ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌తో పాటు కన్వేయన్స్ డీడ్స్ కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఆస్తిపై 10 సంవత్సరాల తర్వాత లబ్ధిదారులకు శాశ్వత హక్కులు వస్తాయన్నారు. నంద్యాల సబ్‌రిజిస్ట్రార్ సునంద, తహసీల్దార్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో వలంటీర్లు పాల్గొనాలి..

రేషన్ పంపిణీలో ఎండీయూ వాహనాల వెంట గ్రామ/వార్డు వలంటీర్లు విధిగా ఉండాలని జేసీ ఆదేశించారు. పట్టణంలోని సాదిక్ నగర్‌లో గురువారం ఎండీయూ వాహనాన్ని డీఎస్ఓ వెంకటరాముడుతో కలిసి తనిఖీ చేశారు. బియ్యం, రాగులు, చక్కెర తదితరాలు సక్రమంగా అందుతున్నాయా..లేదా అంటూ కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. సీఎస్‌డీటీ ప్రసాద్‌రావు ఉన్నారు.

ప్రయోగ పరీక్షలపై అవగాహన



మాట్లాడుతున్న డీవీఈఓ జమీర్‌పాషా,



హాజరైన కళాశాలల అధ్యాపకులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆర్ఐఓ గురువయ్య శెట్టి అధ్యక్షతన జిల్లాలోని అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సైన్స్ అధ్యాపకులకు ప్రయోగ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీవీఈఓ జమీర్‌పాషా హాజరయ్యారు. ఆర్ఐఓ, డీవీఈఓ మాట్లాడుతూ ప్రశ్నాపత్రం ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, పరీక్ష ఏవిధంగా నిర్వహించాలి, మార్కులు ఎలా నమోదు చేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రాక్టికల్స్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సీసీ కెమెరాల ఏర్పాటును వివరించారు. అనంతరం బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ అంశాల్లో రిసోర్స్ పర్సన్స్‌కు అవగాహన కల్పించారు. పరమేశ్వరరెడ్డి, లాలెప్ప, ప్రభు, పద్మావతి, ప్రిన్సిపాల్ సుంకన్న, మురళీ పాల్గొన్నారు.

పీవీ విగ్రహం ఏర్పాటు చేయాలి

నంద్యాల(వ్యవసాయం): దివంగత మాజీ ప్రధాని, బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావు విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సభ్యులు కోరారు. గురువారం ఎమ్మెల్యేను కలిసిన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వెంకటరామరాజు, కార్యదర్శి నగరడోన సుధీర్ మాట్లాడుతూ నంద్యాల పార్లమెంటు సభ్యుడిగా రెండుసార్లు పోటీ చేసి గెలుపొంది ప్రధానిగా దేశానికి సేవ చేయటంతో పాటు నంద్యాల అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందజేశారు.ఎమ్మెల్యే స్పందిస్తూ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్కులో విగ్రహం ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామని హామీనిచ్చారని వారు చెప్పారు. సుబ్బారావు, పసుపుల మురళీ, శుక్ల, నవీన్, సీతారామశర్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



22వ వార్డు క్రాంతినగర్‌లో పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చైర్‌పర్సన్

నంద్యాల(సిటీ): పట్టణంలో అభివృద్ధి నిరంతరాయ ప్రక్రియగా మార్చామని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. 22వ వార్డులో వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రాంతినగర్‌లో రూ.45 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి, 37వ వార్డులో కౌన్సిలర్ సంజీద ఆధ్వర్యంలో రూ.12లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు ఉన్నారు.

ఆసరాతో ఉపాధి..

ఆసరా పథకం ద్వారా ప్రతి మహిళ జీవనోపాధి యూనిట్‌ను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం మెప్మా ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పాంషావలి, మాజీ చైర్‌పర్సన్ దేశం సులోచన, కౌన్సిలర్లు లలిత, షెహనాజ్, చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యురాలు శోభారాణి, వార్డు ఇన్‌చార్జ్‌లు సోమశేఖర్‌రెడ్డి, జాకీర్, బాషా, రహంతుల్లా, మెప్మా సీఎంఎం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తామని పరిపాలనాధికారి పార్థసారధి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నిపుణులైన వైద్యులు పాల్గొని వైద్య సేవలందిస్తారని, సచివాలయ పరిధిలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తె గాయపడ్డారు. పడకండ్లకు చెందిన శివశంకర్‌రెడ్డి, కుమార్తె చైతన్య మోటార్ సైకిల్‌పై నంద్యాలకు వెళ్తుండగా అహోబిలం బైపాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై అదుపుతప్పి కింద పడ్డారు. వారు తీవ్రంగా గాయపడగా స్థానిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు.

ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా అంకిరెడ్డి

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్‌గా డాక్టర్ అంకిరెడ్డిని నియమిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల నంద్యాల అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ప్రకాశం జిల్లా మాచర్లకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో అంకిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

వైశ్యులు రాజకీయాల్లో రాణించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పార్టీలకతీతంగా ఆర్యవైశ్యులు అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లోనూ రాణించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఆర్యవైశ్య మహాసభ జాతీయ నాయకుడు టీజీ వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సౌజన్య కన్వెన్షన్‌లో సంఘం నంద్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా భవనాసి నాగమహేష్ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతనంగా కమిటీ పేద ఆర్య వైశ్యులకు సహకరించాలని సూచించారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఖండే శ్యాంసుందర్‌లాల్, కార్యదర్శిగా కాల్వ విజయశేఖర్, కోశాధికారిగా మామిళ్ల నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పువ్వాడి భాస్కర్, అదనపు కార్యదర్శి మురళీ కృష్ణయ్య, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. వాసవీ సేవాదళ్ అధ్యక్షుడిగా శ్యాంసుందర్‌గుప్తా, యువజన సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా ధనుంజయ, సతీష్, వాసవీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలుగా సుప్రజ,శ్రీలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం



ఉమామహేశ్వరరావును సన్మానిస్తున్న ఉద్యోగులు



తహసీల్దార్ జయప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



చాగలమర్రిలో ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శిని సన్మానించిన దృశ్యం

ఉయ్యాలవాడ : అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి తన వంతు కృషి చేశానని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయిన ఎంపీడీఓకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం జరిగింది. ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, పరిపాలనాధికారి పార్థసారధి, హౌసింగ్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నరసింహారావు, రామకృష్ణారెడ్డి, ఫణీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఎంపీడీఓను ఘనంగా సన్మానించారు.

తహసీల్దార్ బదిలీ

తహసీల్దార్ రవికుమార్‌ను వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు గురువారం కార్యాలయానికి అందాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సొంత జిల్లాలోనున్న అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలనే నిబంధనల మేరకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

శిరివెళ్ల: ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం వైఎస్సార్ జిల్లా గోపవరం మండలానికి బదిలీయయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్ర, ఉపాధి ఏపీఎం రామసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు

దొర్నిపాడు: తహసీల్దార్ జయప్రసాద్ అనంతపురం జిల్లాకు బదిలీ కావడంతో గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం నాగున్నరేళ్లుగా తహసీల్దార్ చేసిన సేవలను కొనియాడారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ వైస్ ప్రెసిడెంట్ మోహన్‌నాయుడు. జేసీఎస్ కన్వీనర్ శివారెడ్డి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఏఓ సునీత డిప్యూటీ తహసీల్దార్, వెంకటరవి, మండల సర్వేయర్ మల్లయ్య, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల మున్సిపల్ కమిషనర్ బదిలీ

నంద్యాల(సిటీ): ఎన్నికల బదిలీల్లో భాగంగా నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవిచంద్రారెడ్డి పర్క్స్,అకౌంట్స్ తమ సొంత డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. గుంటూరు జిల్లా నరసరావు పేట మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.నిరంజన్ రెడ్డి ఇక్కడికి రానున్నారు.

చాగలమర్రిలో..

చాగలమర్రి: ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఎంపీడీఓ మహబూబ్ దౌలా, పంచాయతీ కార్యదర్శి స్వప్న బదిలీ అయ్యారు. ఎంపీడీఓ అనంతపురం జిల్లాకు, చింతలచెరువు కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న స్వప్న గ్రూప్–4 పరీక్షల్లో ఉత్తీర్ణురాలవడంతో ఆళ్లగడ్డ తహసీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యలు చేపట్టారు. వారిని గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ వీరభద్రుడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ గోవిందయ్య, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, ఎఓ భరణికుమారి, పంచాయితీ కారదర్శులు దస్తగిరి, వెంకటేశ్వర్లు, సబియా, రాజాశేఖర్, దాసు, స్వర్ణకుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: రానున్న ఎన్నికలకు సోషల్ మీడియా సైనికులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని తేజస్విని హోటల్‌లో నంద్యాల నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సైనికుల సమావేశం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వీపీ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవడానికి సైనికుల్లా శ్రమిద్దామని కోరారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని, జగనన్న చేసిన మేలును తెలియజేయాలని సూచించారు. అలాగే ప్రతిపక్షాల ఆరోపణలు, విమర్శలకు సరైన విధంగా ఆధారాలతో సమాధానమిచ్చి వారి కుట్రలను ప్రజల ముందు బట్టబయలు చేయాలన్నారు. వీపీ మధుసుధన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి సోషల్ మీడియా సైనికుడు వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కారు రవికుమార్, మాజీ కౌన్సిలర్ అమృతరాజ్ పాల్గొన్నారు.



బ్రాహ్మణకొట్కూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి



సుద్దమల్లలో చిన్న పుల్లారెడ్డికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీకాంత్ గౌడ్



క్రిష్టిపాడులో సుజానమ్మ, కమలమ్మకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ స్వాతి

ఊరూరా పింఛన్ల పండుగ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో వైఎస్సార్ పింఛన్ల పంపిణీ గురువారం తెల్లవారుజాము నుంచే పండుగలా ప్రారంభమైంది. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి నందికొట్కూరు నియోజకవర్గంలోని బ్రాహ్మణకొట్కూరులో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

ఉయ్యాలవాడ : మండలంలో వైఎస్సార్ పింఛన్ పంపిణీ కార్యక్రమం గురువారం పండుగలా సాగింది. తెల్లవారుజామునే వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు అవ్వాతాతలకు తలుపుతట్టి నగదు రూ.3వేలు అందజేశారు. మొదటి రోజు 11 గ్రామ సచివాలయాల పరిధిలో 65 శాతం పంపిణీ చేసినట్లు మండల పరిషత్ పరిపాలనాధికారి పార్థసారధి తెలిపారు.

దొర్నిపాడు: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక తొలిరోజే 95 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం వేకువజాము నుంచే పింఛన్లను వలంటీర్లు పంపిణీ మొదలుపెట్టారు.